భూసేకరణ చట్టం 2013 ప్రకారం
పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్వాసితులకు పరిహారం

- సిఎం రేవంత్ రెడ్డికి జాన్‌వెస్లీ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం పిప్పల్‌కోటి రిజర్వాయర్‌లో నిర్వాసితులకు "భూసేకరణ చట్టం 2013" ప్రకారం పరిహారం ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. రిజర్వాయర్ నిర్మాణంలో కోల్పోతున్న రైతుల భూములను తాను పరిశీలించి రైతులతో మాట్లాడినట్టు తెలిపారు. 2018లో ఎగువన పిప్పల్ కోటి రిజర్వాయర్ కరకట్ట పనులను ప్రభుత్వం ప్రారంభించిందని గుర్తుచేశారు. భూములు కోల్పోయిన రైతులు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందుతుందన్న ఆశతో తమ అవసరాలకు అప్పులు చేశారని తెలిపారు. నేటికి నిర్వాసితులకు నష్టపరిహారం అందకపోవడంతో అప్పులు తీర్చలేక ఇప్పటికే నలుగురు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితుల జీవన పరిస్థితులు దయనీయంగా మారిన నేపథ్యంలో వారికి వెంటనే నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగమివ్వాలని, వ్యవసాయ కార్మిక కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని జాన్‌వెస్లీ విజ్ఞప్తి చేశారు. "పెన్‌గంగా నదిపై చనాఖ-కోర్ట గ్రామాల మధ్య బ్యారేజీ నిర్మాణాన్ని చేపట్టింది. ఇక్కడ కేవలం 0.8 టిఎంసిల నీరు మాత్రమే వున్న చోట వర్షాకాలంలో ఐదు టిఎంసిలకు పైగా వచ్చే విధంగా నీటి సద్వినియోగం కోసం "పిప్పల్‌కోటి రిజర్వాయర్" కరకట్ట పనులు ప్రారంభించింది. 1.4 టిఎంసిల నిల్వ సామర్థ్యం కోసం 1200 ఎకరాల్లో రిజర్వాయర్‌ను, 180 ఎకరాల విస్తీర్ణంలో 4.2 కిలోమీటర్ల పొడవుతో కరకట్ట నిర్మాణాన్ని చేపట్టింది. ఇది కాకుండా కాల్వలు, నీటి నిల్వ కోసం మరో 1000 ఎకరాల సేకరణకు పూనుకున్నది. ఇప్పటికీ మొత్తం 198 మంది రైతుల దగ్గర భూసేకరణ చేశారు. తొమ్మిది నెలల్లో పనులు పూర్తి చేస్తామని చెప్పినప్పటికీ, సంవత్సరాలు గడిచినా పూర్తి కాలేదు. ప్రాజెక్టు అంచనా వ్యయం 369 కోట్ల నుండి 800 కోట్లకు పెరిగింది. కరకట్ట నిర్మాణానికి తీసుకున్న భూములకు 2018 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఎకరాకు రూ.ఎనిమిది లక్షలు చెల్లిస్తామని చెప్పి రు.7.8 లక్షలు ఇస్తామని జిఒ నెం.120ని తెచ్చింది.." అని జాన్‌వెస్లీ వివరించారు.ఒకవైపు భూముల విలువలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం ఎకరాకు రూ.18 లక్షలు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారని జాన్‌వెస్లీ ఆ లేఖలో పేర్కొన్నారు. నష్ట పరిహారం కోసం మూడేళ్ల క్రితమే రైతులు నెలరోజుల పాటు నిరసనలకు దిగారని తెలిపారు. అప్పటి ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలు రైతులకు మద్దతు ప్రకటిస్తూ, తాము అధికారంలోకి రాగానే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు గుర్తుచేశారు. నేటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో బాధిత రైతులు మలిదఫా పోరాటాన్ని ప్రారంభించారు. తక్షణమే ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి, రిజర్వాయర్ పనులను సత్వరమే పూర్తిచేయడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జాన్‌వెస్లీ కోరారు.

రాష్ట్రంలో 'రియల్' రంగం భారీగా పుంజుకుంది

- నిర్మాణ రంగ వృద్ధిరేటు 11.97 శాతం పెరిగింది
- మూడు నెలల్లో ఎఐ సిటీకి భూమి పూజ
- ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రియల్ ఎస్టేట్ రంగం 2024-25లో ఘననీయమైన వృద్ధి రేటు సాధించిందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలెప్ మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో హైటెక్స్‌లో నిర్వహిస్తున్న '15వ నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో'లో ఆయన ఆదివారం పాల్గొని ప్రసంగించారు. '2024-25లో రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవల రంగం 15.4 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. 11.97 శాతం వృద్ధి రేటుతో నిర్మాణ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.80 వేల కోట్లకుపైగా సమకూర్చింది. స్టేట్ సర్వీసెస్ జిఎస్ డిపిలో ఈ రెండు రంగాల వాటానే 24.9 శాతంగా ఉంది' అని అన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాల పరిధిలో 2024 సెప్టెంబర్‌లో రూ.2,820 కోట్ల విలువైన 4,903 ఇండ్ల రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. గతేడాదితో పోల్చితే 35 శాతం అధికమని చెప్పారు. సెప్టెంబర్‌లో రూ.కోటిపైన విలువైన ఆస్తుల రిజిస్ట్రేషన్లలో 151 శాతం, మొత్తం విక్రయాల్లో విలువ పరంగా వీటి వాటానే 53 శాతంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ కుదేలయ్యిందంటూ దుష్ప్రచారం చేస్తున్న వారికి ధీటైన సమాధానమే ఈ గణాంకాలని పేర్కొన్నారు. 'ఇండియాలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది రియల్ ఎస్టేట్ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. అయితే... అభివృద్ధి చెందిన దేశాల జిడిపిలో స్థిరాస్తి రంగ వాటా సగటున పది నుంచి 15 శాతం కాగా, చైనాలో అత్యధికంగా 23 నుంచి 25 శాతం వరకుంది. మన దేశంలో ఇది ఆరు శాతం నుంచి ఎనిమిది శాతమే. ఇది మరింత పెరగాల్సిన అవసరముంది' అని శ్రీధర్‌బాబు అభిప్రాయపడ్డారు. 'ఎలివేటెడ్ కారిడార్లు, మెట్రో ఫేజ్ 2, ఫ్యూచర్ సిటీ, మూసీ సుందరీకరణ, రీజినల్ రింగ్ రోడ్డు తదితర ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ రూపురేఖలు మారిపోనున్నాయి. డిసెంబర్ నాటికి 'ఫ్యూచర్ సిటీ'లో జోనలైజేషన్ ప్రక్రియను పట్టలెక్కించాలనే పట్టుదలతో ఉన్నాం. అక్కడే 200 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్న ఎఐ సిటీకి మూడు నెలల్లోనే భూమి పూజ చేయబోతున్నాం' అని వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నారెడ్కో తెలంగాణ ప్రతినిధులు విజయసాయి మేక, కాళీ ప్రసాద్ దామెర, డా.లయన్ కిరణ్, కె శ్రీధర్ రెడ్డి, ఆర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిఐ చట్టాన్ని రక్షించుకోవాలి

- టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) ద్వారా ప్రజలకు వాస్తవాలను తెలుసుకునే మహత్తర అవకాశముందని టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ చట్టం తీవ్ర ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్లైన సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎంపి అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు అల్లం భాస్కర్, మధు సత్యం గౌడ్, కొమురయ్యతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ఈ చారిత్రాత్మక ఈ చట్టాన్ని తీసుకొచ్చిందని గుర్తు చేశారు. పేదలకు, అణగారిన వర్గాలకు ఇది ఒక జీవనరేఖగా మారిందని తెలిపారు.

రాష్ట్రాల మధ్య వివాదాలకు కేంద్రం కుట్ర

- బనకచర్లకు సహకరించాలన్న కేంద్రం లేఖ పట్ల సిపిఎం ఖండన : జాన్‌వెస్లీ
- అమెరికా సుంకాలపై మోడీ మెతకవైఖరి : తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాన్ని సృష్టించి రాజకీయంగా బిజెపి ప్రభుత్వం లబ్ధి పొందాలని చూస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ బృందావన్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బీకార్ మల్లేశ్ సతీమణి సుమిత్రబాయి సంతాప సభలో ఆమె చిత్రపటానికి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, ఎండి అబ్బాస్, సీనియర్ నాయకులు డిజి.నర్సింహారావు తదితరులు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. బనకచర్ల విషయంలో ఏపీ ప్రభుత్వానికి సహకరించాలని తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం లేఖ రాయడాన్ని ఖండించారు. ఓ వైపు ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచి, మరోవైపు బనకచర్ల నిర్మించడం వల్ల తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోవాలని కోరారు. 42 శాతం బిసి రిజర్వేషన్ అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్, బిల్లు, జిఒ రద్దుకు ప్రయత్నించిందని విమర్శించారు. తెలంగాణలో ఉన్న ఆరుగురు బిజెపి ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఇక్కడ బిసి రిజర్వేషన్లకు అనుకూలంగా మాట్లాడుతూనే కేంద్రంలో వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. బిసి రిజర్వేషన్ల బిల్లు అమలు కాకుండా కేంద్రం అడ్డుపడుతోందని, దానికి నైతిక బాధ్యత వహించి రాష్ట్రంలోని బిజెపి ఎంపిలు, కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బిసి బిల్లు అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, దీనికోసం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో చేసే న్యాయ పోరాటానికి తమ పార్టీ పూర్తి మద్దతు తెలుపుతుందని తెలిపారు. మెదక్ జిల్లాలో మహిళా కూలిపై లైంగికదాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.హనుమకొండలో నకిలీ రైతులు భూమి లేకున్నా.. ధాన్యం అమ్ముకపోయినా ప్రభుత్వ సొమ్ము రూ.1.86 కోట్లు కాజేశారని తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

బిసి రిజర్వేషన్స్‌పై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి : తమ్మినేని వీరభద్రం

42 శాతం బిసి రిజర్వేషన్స్‌పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బిసి రిజర్వేషన్స్ అమలు చేసేందుకు ప్రయత్నం చేసిందని, కానీ కేంద్రం అడ్డుకుంటోందని విమర్శించారు. బిసి రిజర్వేషన్ చట్టబద్ధత కోసం రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేయబోతుందని, అది సరిపోదని, అన్ని పార్టీలనూ కలుపుకొని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అలా చేస్తేనే 42 శాతం బిసి రిజర్వేషన్స్ అమలవుతాయన్నారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం ధాన్యం కోతలు సాగుతున్నాయని, అవసరమైన చోట ఐకెపి కేంద్రాలు ఏర్పాటు చేసి పంటను కొనుగోలు చేయాలని అన్నారు. రైతులకు మద్దతు ధర అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బీకార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందాల ప్రమీల, సయ్యద్ హుషం, వీరేపల్లి వెంకటేశ్వర్లు, వన్‌టౌన్, టూ టౌన్ కార్యదర్శులు డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, భావండ్ల పాండు, రవినాయక్, వినోద్‌నాయక్, శశిధర్‌రెడ్డి, పరుశరాములు, వరలక్ష్మి పాల్గొన్నారు.

గురుకుల ఉద్యోగుల సేవల పునరుద్ధరణ

- సర్కార్ నిర్ణయంతో 4,092 మందికి ఊరట
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వివిధ కేటగిరీల ఉద్యోగుల సేవల కొనసాగింపునకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల విద్యా వ్యవస్థపై తమ ప్రభుత్వం చూపిన చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఇద్దరు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో 1,545, పార్ట్‌టైమ్ విధానంలో 2,102, హానరేరియం పద్ధతిలో 443 మంది... మొత్తం 4,092 మంది ఉద్యోగుల సేవలు పునరుద్ధరించబడ్డాయని తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెం.1533 ప్రకారం తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల సేవలను మరో ఏడాది పాటు పునరుద్ధరించడం జరిగిందన్నారు. గురుకుల విద్యాసంస్థల్లోని వివిధ కేటగిరీల ఉద్యోగుల సేవల కొనసాగింపునకు నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ కోసం పనిచేసే వారిని నియమిస్తాం

- డిసిసి అధ్యక్షుల ఎంపిక కోసం ఎఐసిసికి నివేదిక : పొండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

.కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పాటుపడే వారిని.. అందరి ఆమోదంతో డిసిసి అధ్యక్షులుగా ఎన్నుకుంటామని పొండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి, డిసిసి ఎన్నికల అబ్జర్వర్ వేలు నారాయణస్వామి చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి నివాసంలో ఆదివారం డిసిసి అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల డిసిసి అధ్యక్షుల ఎన్నికల కోసం ఎఐసిసి తనను అబ్జర్వర్‌గా పంపినట్టు చెప్పారు. ఈ మూడు జిల్లాలకు సంబంధించి ఆశావాహుల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, సేవాదళ్ సభ్యుల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. తమకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వారితో సమావేశం అవుతామన్నారు. పార్టీ కోసం వారు చేసిన కృషి, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకొని నివేదికను ఎఐసిసికి ఈ నెల 22వ తేదీ వరకు పంపిస్తామని తెలిపారు. మూడ్రోజులపాటు ఇక్కడే ఉండి నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాలలో డిసిసి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. తెలంగాణలో బిసి రిజర్వేషన్ల అంశంపై పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు నారాయణస్వామి సమాధానం ఇస్తూ.. 42శాతం రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ కృతనిశ్చయంతో ఉన్నాయన్నారు. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల మాదిరిగా ఇక్కడాఅమలు పరచాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నా మన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ అహ్మద్ అలీఖాన్, అబ్జర్వర్లు బొజ్జ సంధ్యారెడ్డి, సాంబుల శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్, కోటేష్, గ్రంథాలయ చైర్మన్ రాజేందర్ తదితరులున్నారు.

ఎల్‌ఐసి బలోపేతానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

- ఐసిఇయు సౌత్ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సంస్కరణల మూలంగా ఎల్‌ఐసి రోజురోజుకు క్షీణిస్తుందని, దీన్ని బలోపేతం చేయడం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసిఇయు) సౌత్ సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి టివిఎన్ఎస్ రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లాలోని ఎస్ఎస్ఎల్‌వి కళ్యాణ మండపంలో ఐసిఇయు వరంగల్ డివిజన్ ప్రెసిడెంట్ బి. శ్రీహరి అధ్యక్షతన ఐసిఇయు వరంగల్ డివిజన్ 39వ వార్షిక మహాసభ జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఎల్‌ఐసి కార్యాలయం నుంచి ఫంక్షన్ హాల్ వరకు ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో రవీంద్రనాథ్ మాట్లాడుతూ. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఎండగట్టారు. ప్లాటినం జూబ్లీ జరుపుకుంటున్న ఐసిఇయు.. తన ప్రయాణంలో ఎన్నో మైలురాళ్లు అధిగమించి ఎన్నో పోరాటాలు నిర్వహించి ఉద్యోగుల హక్కులు సాధించిందని గుర్తు చేశారు. 2004 నుంచి సర్వీస్ టాక్స్‌కు వ్యతిరేకంగా, ఆ తరువాత జీఎస్టీకి వ్యతిరేకంగా యూనియన్ చేసిన పోరాట ఫలితంగా ఇన్సూరెన్స్ ప్రీమియంపై జిఎస్‌టిని ఎత్తివేశారని ఇది గొప్ప విజయమని అన్నారు. 2019 తర్వాత చేసిన నిరంత పోరాట ఫలితంగా అతి త్వరలో ఎల్‌ఐసీలో అసిస్టెంట్ల నియామకం జరగబోతున్నదని తెలిపారు. కాబట్టి పోరాటాల ద్వారా మాత్రమే ఫలితాలు సాధిస్తామని, దానికి సభ్యులందరూ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పదకొండేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యతిరేకంగా ఉందని, ఎల్‌ఐసిని ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలంటే పోరాటం తప్పదని స్పష్టంచేశారు. ఇందులో భావ సారూప్యత కలిగిన ఉద్యోగులను, సామాన్య ప్రజలను కలుపుకొని పోవాలని పిలుపునిచ్చారు. జోనల్ సంయుక్త కార్యదర్శి తిరుపతయ్య మాట్లాడుతూ.. మనం అద్భుతమైన వేతన సవరణ పొందగలిగామంటే అందుకు కారణం ఎల్‌ఐసి బలంగా ఉండటమే అని, మరి సంస్థ అలా బలంగా ఉండాలంటే దాని వెనుక వెన్నుదన్నుగా నిలిచే యూనియన్ కూడా బలంగా ఉండాలని అన్నారు. ఈరోజు వాట్సాప్ యూనివర్సిటీలో వడ్డించి వార్చుతున్న అసత్యాలు, అర్ధసత్యాలను మనం ఉద్యోగుల దృక్పథాన్ని, దృష్టిని అనుసరించి అర్థం చేసుకోవాలని తెలిపారు. లేదంటే అసత్యాలని నిజమైన చరిత్రగా భ్రమపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ర్యాలీగా వెళుతున్న ఐసిఇయు నాయకులు

ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలి : ఎమ్మెల్యే మురళి నాయక్

ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎల్‌ఐసీని బలోపేతం చేయడం ద్వారానే ప్రజలకు ఉపయోగం ఉంటుందని, దానికోసం అందరూ కృషి చేయాలని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళినాయక్ అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎల్‌ఐసి ఎంతో ఉపయోగంగా ఉందని, వంద శాతం క్లెయిమ్స్ ఎల్‌ఐసీ ద్వారా అందుతున్నాయని తెలిపారు. కాబట్టి దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరి మీద ఉందని అన్నారు. ఉద్యోగులు కూడా ఆ రకమైన సేవలను ప్రజలకు అందివ్వాలని కోరారు. ఈ సభలో.. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు, యూనియన్ వరంగల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం ప్రభాకర్, కోశాధికారి రేష్మ, సంయుక్త కార్యదర్శి ఎ చంద్రశేఖర్, మహిళా విభాగ కన్వీనర్ కె అమ్మాజీ, ఎల్‌ఐసి ఎఒఐ నాయకులు కమటం స్వామి, బానోత్ సేవియా, మీగడ లింగన్న, ఎల్‌ఐసి ఎల్‌ఐఎఫ్‌ఐ నాయకులు బెల్లంకొండ శ్రీనివాస్, బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు మల్లేశం మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - కల్చరల్

సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించి పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరునిపై ఉందని సమాచార హక్కు చట్టం కమిషన్ చైర్మన్ పివి శ్రీనివాస్ అన్నారు. సమాచార చట్టం సాధన సమితి ఆధ్వర్యంలో సమాచార చట్టం ఆవిర్భవ దినోత్సవ వేడుకలు రవీంద్ర భారతిలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పివి శ్రీనివాస్, సమాచార హక్కు చట్టం కమిషనర్ భూపాల్, మాజీ జడ్జి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నేరెళ్ల మాల్యాధి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పివి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అనేక మంది త్యాగాల ఫలితంగానే సమాచార హక్కు చట్టం ఏర్పడిందని తెలిపారు. సమాచార హక్కు చట్టం అమలులో అధికారులు పారదర్శకంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. తాము ప్రతి జిల్లాలకు వెళ్లి సమస్యలను పరిష్కరిస్తున్నామని వివరించారు. భూపాల్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయలేకపోవడం వల్ల దాదాపు 18 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకొని సమాచార చట్టాన్ని అమలు చేశారన్నారు. నాలుగు నెలల కాలంలోనే అనేక జిల్లాలలో కమిషన్ పర్యటించి పెండింగ్ కేసులను పరిష్కరించామని వివరించారు. నేరెళ్ల మాల్యాధి మాట్లాడుతూ.. న్యాయవ్యవస్థలో ఉన్న లోపాలే సమాచార హక్కు చట్టంలో ఉన్నాయన్నారు. చట్టంలో మార్పులు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. కొంతమంది ఉద్యోగులకు చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల సరైన సమాచారాన్ని అందించలేక పోవడం వల్ల ప్రజలకు చట్టాలపై నమ్మకం పోతుందన్నారు. చట్టాలలో సంస్కరణలు చేయాలన్నారు. కార్యక్రమంలో సినీనటుడు కిరణ్ కుమార్, సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షురాలు స్రవంతి , దిలీప్ రావు, గోపినాథ్, చింతల రాఘవేంద్ర, చింతల కృష్ణ పాల్గొన్నారు

పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ విజయవంతం

- నేడు, రేపు మిగిలిన పిల్లల ఇళ్లకు సిబ్బంది
- 17,32,172 మంది పిల్లలకు వ్యాక్సినేషన్ లక్ష్యం

వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో తలపెట్టిన పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ విజయవంతమైంది. పొరుగు దేశాల్లో పోలియో కేసులు వెలుగు చూస్తున్న నేపథ్యంలో మన దేశంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని కేంద్ర ఆరోగ్యశాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా మన దేశంలోకి వివిధ దేశాల నుంచి ఎక్కువగా రవాణా ఉన్న 270 జిల్లాలను స్పెషల్ డ్రైవ్ కోసం గుర్తించింది. ఇందులో మన రాష్ట్రంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, హన్మకొండ, సంగారెడ్డి ఉన్నాయి. దీనికి తోడు వరంగల్ జిల్లా పట్టణ ప్రాంతంలోనూ స్పెషల్ డ్రైవ్‌లో పిల్లలకు వ్యాక్సిన్ వేయాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ నిర్ణయించింది. దీంతో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఆరు జిల్లాల పరిధిలో 17,32,171 మంది ఐదేళ్లలోపు పిల్లలకు 6,897 బూత్‌ల ద్వారా పోలియో చుక్కలు వేశారు. స్పెషల్ డ్రైవ్ సందర్భంగా బూత్‌లకు రాని పిల్లల కోసం ఈ నెల 13, 14 (సోమ, మంగళవారాలు) తేదీల్లో ఆరోగ్య సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతంలో ఇంటింటికి తిరగనున్నారు.

హైదరాబాద్ జిల్లాలో 15న కూడా ఇళ్లను సందర్శించి పోలియో చుక్కలను వేయనున్నారు. స్పెషల్ డ్రైవ్ కోసం ఆరు జిల్లాల్లో 59 మొబైల్ టీమ్స్, 138 ట్రాన్సిట్ పాయింట్స్‌ను ఏర్పాటు చేశారు. 576 రూట్ సూపర్ వైజర్లు పర్యవేక్షించారు. వ్యాక్సినేషన్‌లో 9,110 మంది మహిళా ఆరోగ్య కార్యకర్తలు (ఎంపిహెచ్ఎ (ఎఫ్) 6,705 ఆశా కార్యకర్తలు, 6,574 అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. వ్యా

ఎస్ఆర్‌సిపి-2కు మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి పేరు

- 24 గంటల్లోగా జిఒ జారీ
- గోదావరి జలాల కోసం శ్రమించిన దామన్న
- తుంగతుర్తిలో రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సంతాప సభలో సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శ్రీరామ్‌సాగర్ రెండో దశ కాలువకు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేరు పెట్టనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అందుకు సంబంధించి 24 గంటల్లోగా జిఒ జారీ చేస్తామని చెప్పారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం జరిగిన రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సంస్మరణ సభలో సిఎం పాల్గొన్నారు. దామోదర్‌రెడ్డి చిత్రపటానికి ఆయన పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ నివారణ కోసం గోదావరి నీళ్ల తీసుకొచ్చిన ఘనత దామోదర్‌రెడ్డిదేనన్నారు. నమ్మిన ప్రజల కోసం ఆస్తులమ్మి జెండా మోశారని గుర్తు చేశారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా పని చేసినప్పుడు సొంతంగా ఆస్తులు కూడబెట్టుకోకపోగా.. తనకు వారసత్వంగా వచ్చిన భూములను ప్రజాసేవ కోసం అమ్మారని చెప్పారు. తెలుగు రాష్ట్రాలలో టైగర్ దామన్న తెలియని వారు లేరని, టైగర్ అనే బిరుదు వారికే సొంతమని అన్నారు. గాంధీ కుటుంబం దామోదర్‌రెడ్డికి అండగా ఉంటుందని, ఎఐసిసి ఆదేశాల మేరకు భవిష్యత్‌లో కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ "కాంగ్రెస్ అంటేనే నేను... నేను అంటేనే కాంగ్రెస్" అని నిలబడి కొట్లాడిన ధీరోదత్తుడు దామోదర్‌రెడ్డి అని అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పోరాడారని అన్నారు. రాష్ట్రంలో దశాబ్దంపాటు మరో రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఎలాంటి ప్రలోభాలకూ లొంగకుండా కాంగ్రెస్‌లోనే కొనసాగిన మహానేత దామోదర్‌రెడ్డి అని తెలిపారు. ఎన్నికలకు ముందు తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో తన అడుగులో అడుగు వేసిన గొప్ప నాయకుడు దామోదర్‌రెడ్డి మన మధ్య లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఆయన తన జీవితం మొత్తం ప్రజల సంక్షేమం కోసం అంకితం చేశారన్నారు. దామోదర్‌రెడ్డి సోదరులు ఇద్దరూ జోడెద్దుల్లా కాంగ్రెస్ పార్టీ జెండాను మోశారని తెలిపారు.

తుంగతుర్తిలోని సంతాప సభలో మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలంపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన గొప్ప నాయకులు దామోదర్‌రెడ్డి అని కొనియాడారు. దామన్న ఆశయం కోసం అందరం కృషి చేస్తామని, ఆయన కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డికి అండగా నిలబడతామని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీరాంసాగర్ జలాల కోసం రక్తతర్పణం చేసిన గొప్ప నాయకుడు ఆర్‌డిఆర్ అన్నారు. ఎడారిగా ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాను గోదావరి జలాల ద్వారా సస్యశ్యామలం చేశారని చెప్పారు. మాజీ ఎంపీ హనుమంతరావు మాట్లాడుతూ.. దామన్న మరణం యావత్ రాష్ట్ర ప్రజలకు తీరనిలోటన్నారు.

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల ప్రజాభిమానం పొందిన నాయకులు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి వెంకట్‌రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్, ఎంపి రఘువీర్‌రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే రామచందర్‌నాయక్, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, దామోదర్‌రెడ్డి సోదరులు గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అంతరాలు లేని విద్య అందించాలి

- మాజీ ఎమ్మెల్సీ, పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షులు నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులందరికీ అంతరాలు లేని విద్య అందించాలని మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షులు అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'విద్యలో అంతరాలు (అసమానతలు) తొలగిపోయేదెట్టా?' అనే అంశంపై ఆదివారం నల్లగొండ పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో టిపిఎస్‌సి జిల్లా అధ్యక్షులు పాల్వాయి అంజిరెడ్డి అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో సమూల మార్పు వచ్చేదాకా విద్యారంగంలో ఈ అసమానతలు కొనసాగడం కన్నా.. అంతరాలు లేని విద్యాసమాజాన్ని నిర్మించుకోవాలన్నారు. కవులు, రచయితలు తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్యం చేయాలని కోరారు. వివిధ సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేసి ప్రజలను ఆలోచింపజేయాలనే ఉద్దేశంతో ఈ కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని అన్నారు. కవులు సమాజ నిర్దేశకులని, వారి ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఆరు దశాబ్దాల కింద కొఠారి కమిషన్ చెప్పిన కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెడితేనే విద్యారంగంలో అసమానతలు రూపుమాపబడతాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి కవి సమ్మేళనాలు జరుపుతామని, హైదరాబాద్‌లో మొదటిది జరగ్గా.. రెండోది నల్లగొండలో నిర్వహించామని చెప్పారు. భవిష్యత్‌లో ఈ కవితా సంకలనాలను పుస్తకంగా తీసుకురానున్నట్టు తెలిపారు.

వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధేశ్యామ్ మాట్లాడుతూ.. విద్యారంగంలో అసమానతలు ఉండటం వల్ల విలువలు పతనమవుతున్నాయన్నారు. విలువలను కాపాడుకుంటూనే సమాన విద్య కోసం కవులు, రచయితలు తమ రచనలతో సామాజిక చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కవులు డా. సాగర్ల సత్తయ్య, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, బైరెడ్డి కృష్ణారెడ్డి, డా. పగడాల నాగేందర్, మునాసు వెంకట్, పెరుమాళ్ల ఆనంద్, భూతం ముత్యాలు, శ్యాంసుందర్, పగిడిపాటి నరసింహ, లింగమూర్తి, భీష్మాచారి, బండారు శంకర్, హుస్సేన్, గేర నరసింహ, యాదగిరి, కె.మంగ, ధనమూర్తి, వాణిశ్రీ, రాఫెల్, నలపరాజు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు వై స్వప్న
- ఆమనగల్‌లో రాష్ట్ర మహాసభ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.స్వప్న డిమాండ్ చేశారు. ఈ నెల 26, 27 తేదీల్లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో నిర్వహించనున్న మధ్యాహ్న భోజన కార్మికుల 4వ రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆదివారం ఆమనగల్ పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా అదనంగా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ఇబ్రహీంపట్నంలో రెండు రోజులపాటు నిర్వహించే రాష్ట్ర మహాసభకు మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఏరియా కన్వీనర్ జె పెంటయ్య, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సబియా బేగం, పద్మ, ఆమనగల్, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

డ్రోన్లతో గంజాయి మొక్కలను గుర్తిస్తున్న పోలీసులు

డ్రోన్లతో గంజాయి మొక్కల గుర్తింపు

- సాగు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గంజాయి సాగును నిర్మూలించే లక్ష్యంతో కుమురం భీం పోలీసులు వినూత్నంగా ఆలోచన చేశారు. డ్రోన్ల ద్వారా గంజాయి సాగు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటిని పూర్తిగా నిర్మూలించేందుకు పోలీస్ శాఖ చర్యలు ప్రారంభించింది. ఆదివారం కుమురం ఆసిఫాబాద్ ఎఎస్‌పి చిత్తరంజన్ ఆధ్వర్యంలో కెరమెరి మండలం అంతపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని నారాయణగూడలో డ్రోన్ సహాయంతో పంట భూముల్లో తనిఖీలు నిర్వహించారు. రాథోడ్ బాలాజీ వ్యవసాయ పొలంలో 51 గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. జూన్ నుంచి ఆసిఫాబాద్ సబ్ డివిజన్‌లో 51 కేసులు కాగా.. 560 మొక్కలు స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి డ్రోన్‌లతో తనిఖీలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వాంకిడి సిఐ సత్యనారాయణ, ఎస్ఐ మధుకర్ పాల్గొన్నారు.

జనగామ సబ్ జైల్‌లో విచారణ ఖైదీ ఆత్మహత్య

- బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనగామ జిల్లాలోని సబ్ జైల్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్న వారాల మల్లయ్య ఆత్మహత్య చేసుకున్నాడు. దాంతో మృతిని కుటుంబ సభ్యులు, బంధువులు ఆదివారం జనగామ సబ్ జైలు వద్ద ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తతగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన చెందిన వారాల మల్లయ్య.. పక్కింటి వారితో జరిగిన వివాదంలో పోలీసులు కేసు నమోదు చేయగా పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి గత సోమవారం జనగామ సబ్ జైలుకు తరలించారు. మనస్తాపం చెందిన మల్లయ్య శనివారం మధ్యాహ్నం మరుగుదొడ్లు కడిగే బ్లీచింగ్ పౌడర్‌ను నీళ్లలో కలుపుకొని తాగాడు. విషయం తెలుసుకున్న జైలు సిబ్బంది జనగామ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో అదేరోజు రాత్రి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కాగా, శనివారం రాత్రి రిమాండ్ ఖైదీ మృతిచెందాడు. దాంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు తమకు న్యాయం చేయాలని, మృతికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున జైలు వద్దకు చేరుకొని ఆందోళన నిర్వహించారు.

రాపిడో బైక్‌ను ఢీకొట్టిన లారీ

- ద్విచక్ర వాహన డ్రైవర్, డాక్టర్ మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాపిడో బైక్‌ను ఇసుక లారీ ఢీకొట్టడంతో డ్రైవర్‌తోపాటు బైక్ వెనుక కూర్చున్న డాక్టర్ మృతిచెందారు. ఈ ఘటన హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రీన్‌ల్యాండ్స్ వద్ద వైట్‌హౌస్ ఎదురుగా జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో గ్రీన్‌ల్యాండ్స్ నుంచి బేగంపేట్ వైపు వెళ్తున్న 16 టైర్ల ఇసుక లారీ రాపిడో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రాపిడో డ్రైవర్ ముద్దంగల్ నవీన్(30) అక్కడికక్కడే మృతిచెందారు. వెనుక కూర్చున్న డాక్టర్ కస్తూరి జగదీష్‌చంద్ర (35)కు తీవ్రగాయాలు కాగా, స్థానికంగా ఉన్న ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలో డాక్టర్ మృతిచెందారు. నవీన్ స్వస్థలం ఖమ్మం జిల్లా హవేలి ఘన్‌పల్‌కాగా, హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ వద్ద నివాసముంటూ రాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. డాక్టర్ కస్తూరి జగదీష్ చంద్రది కరీంనగర్ జిల్లా ధర్మపురి స్వస్థలం. బేగంపేట్‌లోని కుండన్‌బాగ్, మేతడిస్ట్ కాలనీలో నివాసముంటూ కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిలో జనరల్ ఫిజీషియన్‌గా పనిచేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తేల్చారు. లారీ డ్రైవర్ పసుపుల శంకరను నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం షాపులకు 5,663 దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2,620 మద్యం షాపులకు ఇప్పటి వరకు 5,663 దరఖాస్తులు వచ్చాయి. గౌడ షాపులకు 671, ఎస్‌సి రిజర్వేషన్లు 202, ఎస్‌టి రిజర్వేషన్లు 84, జనరల్‌లో 4,686 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాల వారీగా చూస్తే అదిలాబాద్‌లో 142, హైదరాబాదులో 746, కరీంనగర్‌లో 392, ఖమ్మంలో 260, మహబూబ్ నగర్‌లో 278, నల్లగొండలో 568, మెదక్‌లో 411, నిజామాబాద్‌లో 255, రంగారెడ్డిలో 2,353, వరంగల్‌లో 258 దరఖాస్తులు వచ్చాయి. చివరి ఆరు రోజుల్లో భారీగా దరఖాస్తులు వచ్చే అంచనాలు ఉండడంతో రంగారెడ్డి, హైదరాబాద్ డివిజన్లతోపాటు ఉమ్మడి జిల్లాల వారీగా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేశారు. దరఖాస్తుదారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. గత రెండేళ్ల క్రితం మద్యం షాపులకు 1.32 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఈసారి దరఖాస్తులు గతంలో కంటే మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయని ఆ శాఖ అంచనా వేస్తోంది. కాగా ఈ నెల 18 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు.

గిరిజన మహిళపై లైంగిక దాడి ఘటనపట్ల విచారణ

- తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెదక్ మండలం, జానకంపల్లి పంచాయతీ పరిధిలోని ఓ తండాకు చెందిన గిరిజన మహిళపై జరిగిన లైంగిక దాడి ఘటనపై సమగ్ర విచారణ జరపి, దోషులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మ నాయక్, ఆర్ శ్రీరాం నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడుపాయలకు వెళ్లే దారిలో అక్టోబర్ 11న రాత్రి కొంత మంది యువకులు సామూహిక లైంగిక దాడికి పాల్పడిన ఘటన సభ్య సమాజం సిగ్గుపడేలాగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళను వివస్త్రను చేసి చెట్టుకు కట్టేసి మానవ మృగాలు ఘాతుకానికి పాల్పడ్డాయని అన్నారు. ఘటన జరిగి రెండు రోజులైనా ఇప్పటి వరకు పోలీసులు నిందితులను ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో గిరిజనులు, గిరిజన మహిళలపై అత్యాచారాలు, హత్యలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి సంఘటనల పట్ల కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

పల్స్‌పోలియోవ్యాక్సిన్ వికటించి చిన్నారి మృతి

- సంగారెడ్డి జిల్లా భీంరా గ్రామంలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పల్స్ పోలియో వ్యాక్సిన్ వేసిన 20 నిమిషాలకే మూడు నెలల బాలుడు మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం భీంరా గ్రామంలో ఆదివారం జరిగింది. బాలుని తల్లిదండ్రులు స్వర్ణలత, ఉమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం స్థానిక పోలింగ్ కేంద్రంలో బాలుడికి పల్స్ పోలియో వేయించారు. పోలియో వేసిన 20 నిమిషాలకే ఆ బాలునికి వాంతులు, విరోచనాలు అయ్యాయి. దాంతో వెంటనే కంగ్టిలోని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే ఆ బాలుడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మరో ఏడు నెలల బాలికకు కూడా వాంతులు, విరోచనాలు కావడంతో ఖేడ్‌కు తరలించారు.

మోసాల పునాదిపై కాంగ్రెస్ పాలన

- ప్రజలకు పనికిరాని పార్టీ బిఆర్ఎస్ : ఏలేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో మోసాల పునాదిపై కాంగ్రెస్ పాలన నడుస్తోందని బిజెపిఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బిజెపిపై కెటిఆర్ విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కెటిఆర్ పూజకు పనికిరాని పువ్వు లాంటివారని, బిఆర్ఎస్ ప్రజలకు పనికిరాని పార్టీ అని విమర్శించారు. లిక్కర్, కాళేశ్వరం, తదితర స్కామ్‌లలో బిఆర్ఎస్ పార్టీ ఇరుక్కున్నది కాబట్టే ప్రజలు ఎన్నికల్లో ఛీకొట్టారన్నారు. రాబోయే రోజుల్లో బిజెపి అధికారంలోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో 80 శాతం హామీలు అమలు చేశామని మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పడం విడ్డూరంగా ఉందని, ఆయన ప్రభుత్వంలో లేనట్టు ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే ఈ విషయంలో చర్చకు రావాలని, వారికి నమ్మకముంటే ప్రభుత్వాన్ని రద్దు చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు.

కాంగ్రెస్‌ను ఓడించండి

- అప్పుడు హామీలు అమలు చేస్తారు : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడిస్తే ఆ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో కెటిఆర్ సమక్షంలో షేక్‌పేట్ డివిజన్‌కు చెందిన బిజెపి సీనియర్ నాయకులు చెర్క మహేష్. తన అనుచరులతో గులాబీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ ప్రజలకు కారు కావాలా? బుల్డోజర్ కావాలా? నిర్ణయించుకోవాలన్నారు. రెండేండ్లలో ఒక్క హామీని అమలు చేయని కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ నగరం తిరిగి అభివృద్ధిలోకి రావాలంటే మళ్లీ కెసిఆర్ రావాలని, అది జూబ్లీహిల్స్ నుంచే మొదలు కావాలని ఆకాంక్షించారు.

ఒక్క మంచి పని చేయని కాంగ్రెస్ సర్కార్ రూ.2.30 లక్షల కోట్లు అప్పు మాత్రం చేసిందని చెప్పారు. నగరంలో పేదల ఇళ్లు లేకుండా బుల్డోజర్లతో కూల్చేస్తున్నారని విమర్శించారు. మొసం చేసే వారినే ప్రజలు నమ్ముతారని గతంలో సిఎం రేవంత్ రెడ్డి చెప్పారని, తెలిసి ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డి సర్కార్‌కు బుద్ధి చెప్పాలని సూచించారు.

దేశంలో ఇంకా కులవివక్ష

- ఎస్‌సి రిజర్వేషన్ 15 నుంచి 18 శాతం పెంచాలని తీర్మానం చేసినా అమలు కాలేదు
- మంత్రి లక్ష్మణ్ కావాలనే నా మీద విమర్శలు చేస్తున్నారు
- మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు గడిచినా ఇంకా కుల వివక్ష కొనసాగుతుందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. దివంగత నేత గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి ఉత్సవం సందర్భంగా మాల సంఘం జిల్లా అధ్యక్షులు చోక్కం దేవిదాస్, కన్వీనర్ అలుక కిషన్ ఆధ్వర్యంలో మాలల ఐక్య సదస్సును నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో జరిగిన మాలల గర్జనతో మాలల్లో ఐక్యత పెరిగిందని అన్నారు. దేశంలో ఒక సామాజిక తరగతికి చెందిన సభ అంత పెద్దగా జరగటం అదే మొదటిసారని తెలిపారు. మాలల కోసం పోరాటం చేస్తుంటే.. కొందరు కుట్రలు చేసి.. సోషల్ మీడియా వేదికగా తనను అవమానించే ప్రయత్నం చేశారని అన్నారు. ఆనాడు ఎస్సీ రిజర్వేషన్‌ను 15 నుంచి 18 శాతం పెంచాలని తీర్మానం చేశామని.. కానీ అమలు కాలేదన్నారు. దేశంలో ఇంకా కులవివక్ష ఉందని.. అందుకే మాల ఉద్యోగులకు వేధింపులు తప్పటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మంత్రిగా తన పని తాను చేసుకుంటూ పోతున్నానని, అయినా తన మీద కావాలనే కొందరు విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి లక్ష్మణ్ అంశంలోనూ అనవసరంగా తన పేరు ప్రచారం చేశారని గుర్తు చేశారు. మంత్రి లక్ష్మణ్ కుమార్‌ను రాజకీయంగా ప్రోత్సహించింది కాకా అని, మంత్రి లక్ష్మణ్ కావాలనే తనపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. అనంతరం వర్ధన్నపేట ఎమ్మెల్యే కె నాగరాజు మాట్లాడుతూ.. మాలల వర్గీకరణ కోసం నిరంతరంగా పోరాడుతూనే వస్తున్నామని అన్నారు. అన్ని కుల సంఘాలు సహకరించి బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన 'బోధించు, సమీకరించు, పోరాడు' అనే సూక్తిని ప్రతి ఒక్కరూ పాటించాలని తెలిపారు. తాను ఐపిఎస్‌గా తన విధులకు ఆటంకం కలిగించకుండా పనిచేశానని గుర్తు చేశారు.

కానీ రాజకీయాల్లో కుల వివక్ష కొనసాగుతుందని, దీనిపై పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల గ్రూప్-1, గ్రూప్-2లో విజయం సాధించిన అభ్యర్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాలల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు చెన్నయ్య, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి, రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, నాయకులు దయానంద్, ఎడ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకత, నిబద్ధత, సామర్థ్యం ఉండేలా..

నూతన అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ

- ఎఐసిసి అబ్జర్వర్ నవజ్యోతి పట్నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పారదర్శకత, నిబద్ధత, సామర్థ్యం, కార్యకర్తల అభిమానం కలిగిన వారికే కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని వరంగల్, హనుమకొండ జిల్లాల ఎఐసిసి అబ్జర్వర్ నవజ్యోతి పట్నాయక్ తెలిపారు. ఆదివారం హనుమకొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన డిసిసి అధ్యక్షుల నియామకం కోసం హనుమకొండ, వరంగల్ జిల్లాలో నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్షుల ఎంపిక విధానంలో కాంగ్రెస్ పార్టీ సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. పార్టీ కార్యకర్తలు, మాజీ పదవీదారులు, ప్రస్తుత ప్రజా ప్రతినిధులు, సివిల్ సొసైటీ సభ్యులు, సీనియర్ నాయకుల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుంటామని అన్నారు. ఈ అభియాన్ ద్వారా అధికారం కేవలం కొంతమందికి మాత్రమే పరిమితం కాకుండా, ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మైనారిటీలు, మహిళలు, యువత వంటి అన్ని వర్గాలకు నాయకత్వ అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. వినయంతో, దూరదృష్టితో, ప్రజా సమస్యల పట్ల నిబద్ధత కలిగిన నాయకులను సూచించాలని కోరారు. పార్టీ పునర్నిర్మాణంలో కార్యకర్తలు, నాయకుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందని అన్నారు. నూతన అధ్యక్షుల ఎంపిక ప్రక్రియలో ప్రతి నియోజకవర్గ ముఖ్య నేతలతో సంప్రదింపులు చేస్తామని తెలిపారు. నేడు (సోమవారం) హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ జిల్లా స్థాయి ముఖ్య నాయకులు, ప్రతినిధులతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి నాయకులతో సమీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నెల 14న వరంగల్‌లో పరకాల నియోజవర్గ కాంగ్రెస్ నాయకులతో, 16న తూర్పు నియోజకవర్గం, 17న వర్ధన్నపేట, 18న నర్సంపేట నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ శ్రేణులతో సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాల అబ్జర్వర్‌లుగా వచ్చిన దుర్గం భాస్కర్, మసూద్, రేణుక, కో ఆర్డినేటర్ ఆదర్శ్ జైస్వాల్‌తోపాటు ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ జక్కుల రవీందర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, సీనియర్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి, రహీమున్నీసా బేగం, కట్ట రఘుపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనొద్దు.. మీకు బిఆర్ఎస్ అండ

- జోర్డాన్‌లో చిక్కుకున్న కార్మికులకు హరీశ్ రావు భరోసా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆందోళన చెందవద్దని, బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని జో